

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

విజయవాడ సోమవారం 24-08-2026 సంపుటి: 02 సంచిక : 52 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని
Vijayawada Monday, 24-08-2026 Volume :02 Issue: 52 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani


## యుద్ధ బాధితులు యూఎస్ జవాన్లు



- ఇరాన్‌తో ఘర్షణలో 18 మంది మృతి
- 756 మందికి గాయాలు
- వార్‌కు ఆరు నెలలు
- పెంటగాన్ నివేదిక వెల్లడి

02

## అంతరిక్ష రంగంలో అద్భుతాలు చేద్దాం



- ప్రపంచ ప్రతిభను అయస్కాంతంలా ఆకర్షిద్దాం
- అందుకు తగిన వాతావరణం సృష్టిద్దాం
- అంతరిక్ష రంగంలో గట్టి పోటీ ఇద్దాం
- నిలకడతో కూడిన విధానాలు తీసుకొస్తాం
- రిస్క్ తీసుకునే వారికి భరోసా ఇస్తాం
- ప్రతిభ, నాణ్యతలో రాజీలేదు .. రైతుల దిగుబడి పెంపుదలకు సాయపడండి
- స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులకు ప్రధాని మోడీ పిలుపు

02



### నేడు ఏలూరు జిల్లాలో సీఎం
## చంద్రబాబు పర్యటన

- ఉపరాష్ట్రపతితో కలిసి మొక్కజొన్న కొత్త వంగడాన్ని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి
- దేశంలోనే తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ మెయిజ్ విత్తనం
- అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంలో కార్యక్రమం
- రైతుల పంటకు విలువ జోడించడమే లక్ష్యం
- ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రయత్నం
- ఉదయం 10.15 గంటలకు కాట్రేనిపాడుకు సీఎం చేరిక
- 11 గంటలకు విత్తనం ఆవిష్కరణ కార్యక్రమం
- మధ్యాహ్నం 1.20 గంటలకు సచివాలయానికి సీఎం

అమరావతి

రైతుల పంటకు విలువ జోడించి, ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మార్కెట్‌కు తరలించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రయోగానికి ఏలూరు జిల్లా ముసునూరు వేదిక కానుంది. గోర్మే పాప్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంలో.. దేశంలోనే తొలి నాన్-జీఎమ్ఓ (జన్యు మార్పిడి చేయని) పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని సోమవారం ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సంయుక్తంగా ఆవిష్కరించనున్నారు. దేశవ్యాప్తంగా వేలాది ఎకరాల సాగుతో వేలమంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉన్న ఈ సంస్థ, దేశంలోని ప్రధాన సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో

-మిగతా 2 లో

# ఆయుష్‌కు భారీ ఊతం

### ఆయుష్‌కు కేంద్రం నుంచి రూ.185.75 కోట్ల వార్షిక కేటాయింపు



రాష్ట్ర ఆయుష్ చరిత్రలోనే అత్యధిక నిధులు

- మూడేళ్లలో ఏపీకి రూ.434.64 కోట్ల నిధులు
- గిరిజన ప్రాంతాల్లో 19 మొబైల్ వైద్య యూనిట్లు
- 601 ఆయుష్ డిస్పెన్సరీలకు డిజిటల్ సేవలు
- 64 డిస్పెన్సరీల ఆధునికీకరణకు రూ.12.80 కోట్లు
- 712 డిస్పెన్సరీలకు ఉచిత మందుల సరఫరా
- ఆయుష్ విద్యాసంస్థల బలోపేతానికి రూ.38.84 కోట్లు
- టెలిమెడిసిన్, ఇంటర్నెట్ సేవల విస్తరణకు ప్రాధాన్యం
- కడపలో ఆయుష్ స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- బోధనాస్పత్రుల్లో వ్యసన విముక్తి కేంద్రాల ఏర్పాటు
- పంచకర్మ, యోగా సేవలకు పెద్దపీట
- సచివాలయం, జైళ్లలో యోగా వెల్‌నెస్ కేంద్రాలు
- హైకోర్టు ప్రాంగణంలో ప్రత్యేక ఆయుష్ క్లినిక్
- ఆరు సమీకృత ఆయుష్ ఆస్పత్రులకు కొనసాగింపు నిధులు
- గ్రామీణ ప్రాంతాల్లో నేచురోపతి యూనిట్ల అభివృద్ధి
- కేంద్రానికి మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ వైద్య రంగానికి భారీగా నిధులు సమకూరాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో పాటు కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న సమన్వయం ఫలితంగా ఆయుష్ రంగం అభివృద్ధికి గణనీయమైన ఊతం లభించింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా 2026--27 రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళికకు కేంద్ర ఆయుష్ మిషన్ డైరెక్టరేట్ రూ. 185.75 కోట్లకు ఆమోదం తెలిపింది. జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి లభించిన అత్యధిక వార్షిక కేటాయింపు ఇదే కావడం విశేషం. 2024--25 నుంచి 2026--27 వరకు మూడేళ్లలో కలిపి రాష్ట్రానికి రూ. 434.64 కోట్ల ఆయుష్ నిధుల కేటాయింపులకు కేంద్రం ఆమోదం తెలిపింది.

-మిగతా 2 లో



### మరింత బలపడుతున్న
## ఎల్ నినో..


- వాతావరణ విభాగం వెల్లడి
- బలహీనపడుతున్న రుతుపవన ద్రోణి
- సెప్టెంబర్‌లో మరింత పెరుగనున్న వర్షపాతం లోటు

హైదరాబాద్,

పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రభావం క్రమంగా బలపడుతున్నది. దీంతో భారత్‌లో నైరుతి రుతుపవనాలు బలహీనపడటం ప్రారంభమైంది. బంగాళాఖాతంలో అప్పుడప్పుడూ అల్పపీడనాలు ఏర్పడుతున్నా.. అవి బలపడుతున్న సూచనలు కనిపించడం లేదు. దీంతో అల్పపీడన వర్షాలు కూడా తగినంతగా కురువడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారత వాతావరణ విభాగం మరో కీలక ప్రకటన చేసింది. సాధారణంగా అయితే దేశంలో రుతుపవనాలు ప్రస్తుతం చాలా చురుగ్గా ఉండాలి. కానీ పరిస్థితి రివర్స్ అయ్యి బలహీన పడుతున్నట్టు అధికారులు తెలిపారుకనీసం రాబోయే రెండు వారాలపాటు అంటే సెప్టెంబర్ 2 వరకు దేశవ్యాప్తంగా

-మిగతా 2 లో

### గుజరాత్‌లో కల్తీ మద్యం
## 13 మంది మృతి



02

## సీజేపీ మరో ఉద్యమం?

- హామీల అమలులో జాప్యం.. కేంద్రంపై ఆగ్రహం
- దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలకు యోచన
- నేడు సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ భేటీ
- తదుపరి కార్యాచరణపై కీలక సమీక్ష

02

కేంద్రం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ మరోసారి దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతోంది. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, శాంతియుత నిరసనకారులపై చర్యలు తీసుకోకపోవడం, నీట్ పరీక్ష నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన అభ్యర్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం వంటి హామీల అమలులో జాప్యంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకునేందుకు నేడు జరిగే జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంపై ఉత్కంఠ నెలకొంది.

COCKROACH
JANTA PARTY



### పార్లమెంట్ మళ్లీ
## సమావేశమయ్యేనా!

- ఆగస్టు 13న నిరవధికంగా ని వాయిదా పడిన ఉభయ సభలు
- వర్షాకాల సమావేశాల ముగింపుపై నోటిఫికేషన్ రాలేదు
- మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రం కసరత్తు
- 2029 ఎన్నికల నాటికి రిజర్వేషన్లు అమలు చేసే యోచన
- డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న బిల్లుపై ఆసక్తి
- కేంద్ర తీరుపై కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ ప్రశ్నలు

న్యూఢిల్లీ,

పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులైనా అధికారికంగా వర్షాకాల సమావేశాలు ఇంకా ముగియలేదు. దీంతో కొత్త సమావేశాన్ని ఏర్పాటు చేయకుండానే ఒక కీలకమైన చట్టాన్ని ఆమోదించాలని కేంద్రం యోచిస్తున్నదని, పార్లమెంట్‌ను తిరిగి సమావేశపరుస్తుందన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. లోక్‌సభ, రాజ్యసభలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. అలా జరిగిన తర్వాత సాధారణంగా

-మిగతా 2 లో



### బంగాళాఖాతంలో
## అల్పపీడనం

- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం
- పలు జిల్లాల్లో దంచి కొట్టనున్న వర్షాలు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్:

ఆగస్టు నెల ప్రారంభమైనప్పటి నుంచి వాతావరణ శాఖ తొలిసారి తెలంగాణకు భారీ హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగస్టు మాసంలో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో కేవలం 6 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. దీనివల్ల 18 శాతం వర్షపాత లోటు ఏర్పడగా, తాజాగా పడుతున్న వర్షాలతో ఉపశమనం లభించనుంది. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు.

-మిగతా 2 లో

### ఖరగ్‌పూర్--అమరావతి హైవేకు
# గ్రీన్ సిగ్నల్

### 1,107 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌కు కేంద్రం ఆమోదం

- ఏపీ పరిధిలో 457 కి.మీ. మేర హైవే నిర్మాణం
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.32 వేల కోట్లు
- నాలుగు లేన్ల హైవేగా అభివృద్ధి
- ఖరగ్‌పూర్ నుంచి అమరావతికి నేరుగా అనుసంధానం
- నాలుగు జిల్లాల మీదుగా హైవే నిర్మాణానికి ప్రతిపాదనలు
- తూర్పు భారత మార్కెట్లకు ఏపీ సరుకు రవాణా సులభతరం
- రైతులు, పరిశ్రమలకు తగ్గనున్న రవాణా వ్యయం
- వ్యాపారం, వ్యవసాయం, పరిశ్రమలకు ఊతం
- అమరావతి కనెక్టివిటీ మరింత బలోపేతం




అమరావతి

రాష్ట్ర రాజధాని అమరావతికి తూర్పు భారతదేశంతో రహదారి అనుసంధానం మరింత బలోపేతం కానుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి అమరావతి వరకు ప్రతిపాదించిన 1,107 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ హైవే కారిడార్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా వెల్లడిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రహదారులు-రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఏపీ ప్రజల

-మిగతా 2 లో

# యుద్ధ బాధితులు యూఎస్ జవాన్లు

**-ఇరాన్‌తో ఘర్షణలో 18 మంది మృతి**
**-756 మందికి గాయాలు**
**-వార్‌కు ఆరు నెలలు**
**-పెంటగాన్ నివేదిక వెల్లడి**



వాషింగ్టన్:
అమెరికాలో పెంటగాన్ అందించిన సమాచారం ప్రకారం ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా సైన్యంలో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 770కి పైగా పెరిగింది. ఈ సంఘర్షణ ఇప్పుడు ఆరో నెలలోకి అడుగుపెట్టింది. వాషింగ్టన్ పోస్ట్ నివేదిక ప్రకారం పెంటగాన్ క్యాజువాల్టీ రిపోర్టింగ్ సిస్టమ్‌లో 774 మంది అమెరికా సైనికులు మరణించినట్లు లేదా గాయపడినట్లు నమోదైంది. వీరిలో 18 మంది మరణించగా 756 మంది గాయపడ్డారు. ఇటీవల రోజుల్లో అనేక మంది కొత్త సైనికులను గాయపడిన వారి జాబితాలో చేర్చారు. అయినా అమెరికా–ఇరాన్ మధ్య ఇటీవల వారాల్లో ఎక్కువగా కాల్పుల విరమణ కొనసాగుతోంది. జూన్‌లో సంతకం చేసిన 14 అంశాల అవగాహన ఒప్పందం ప్రకారం కాల్పుల విరమణ సోమవారం ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాన్ని పొడిగించలేదు. అయితే అప్పటినుంచి ఇరు పక్షాల నుంచి పెద్ద ఎత్తున పోరాట కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కాలేదు. సీఎన్ఎన్ నివేదిక ప్రకారం బుధవారం నాటికి గాయపడిన అమెరికా సైనికుల సంఖ్య 750ని దాటింది. డిఫెన్స్ క్యాజువాల్టీ అనాలసిస్ సిస్టమ్‌లో ఓవర్‌సీస్ ఆపరేషన్స్ గణాంకాలను ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ గణాంకాలతో కలిపితే ఫిబ్రవరి 28న అమెరికా ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి 18 మంది సైనికులు మరణించినట్లు తెలుస్తోంది. ఈ సంఘర్షణ ఆరు నెలలుగా కొనసాగుతూ అమెరికా సైనిక నష్టాలు క్రమంగా పెరుగుతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.

## మరింత బలపడుతున్న ఎల్ నినో..

మొదటి తరువాయి

సాధారణం కంటే తకువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదని వెల్లడించారు. రుతుపవన ద్రోణి మధ్య భారతదేశం మీదుగా కదలడానికి బదులుగా హిమాలయ పాదాల వద్దే స్థిరంగా ఉండిపోవడంతో, ఇప్పటికే సగటు కంటే 14% తకువగా ఉన్న దేశవ్యాప్త వర్షపాత లోటు మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉన్నదని పేర్కొన్నారు. ప్రైవేట్ వాతావరణ అంచనా సంస్థ స్కైమెట్ వెదర్ కూడా తన సవరించిన అంచనాలో రుతుపవన వర్షపాతం ఇప్పుడు దీర్ఘకాల సగటులో కేవలం 85% మాత్రమే ఉంటుందని తేల్చేసింది. ఏప్రిల్‌లోని 94% అంచనాతో పోలిస్తే ఇది తకువ. అలాగే కరువు వచ్చే అవకాశాలు 70% ఉన్నట్టు తెలిపింది. ఆగస్టులో మిగిలిన వారాల్లో దేశంలోని నాలుగు ఏకరీతి వర్షపాత ప్రాంతాల్లో అసమాన పంపిణీ ఉంటుందని స్కైమెట్ హెచ్చరించింది. బలపడుతున్న ఎల్ నినో, బలహీనపడిన హిందూ మహాసముద్ర ద్విధ్రువం కారణంగా సెప్టెంబరులో ఈ లోటు మరింత తీవ్రమవుతుందని అంచనా. తాజా పరిణామాల ప్రభావం వ్యవసాయం, ధరలపై తీవ్రంగా ఉంటుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి.

## సీజేపీ మరో ఉద్యమం?

-హామీల అమలులో జాప్యం.. కేంద్రంపై ఆగ్రహం
-దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాలకు యోచన
-నేడు సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ భేటీ
--తదుపరి కార్యాచరణపై కీలక సమీక్ష




న్యూఢిల్లీ:
కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై క్రాంకోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేడు (ఆగస్టు 24న) జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో సమీక్ష నిర్వహించనుంది. జులై 25న దేశవ్యాప్త ఆందోళనను విరమించిన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందని సీజేపీ ఆరోపించింది. ప్రత్యేకంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం లేదా కొట్టివేయడం, భవిష్యత్తులో శాంతియుత విద్యార్థి ఆందోళనకారులపై చర్యలు తీసుకోకపోవడం, నీట్ పరీక్ష రద్దు నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన అభ్యర్థుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి అంశాలపై హామీలను అమలు చేసేవిషయంలో కేంద్రంపై సీజేపీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆగస్టు 18న విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్ సమగ్ర జాబితాను ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు కోరిందని, అయితే ఆ జాబితాను కేంద్రం ఇంకా సమర్పించలేదని సీజేపీ ఆరోపించింది. కేంద్రం తమ హామీలను ఆలస్యం చేయడం, నీరుగార్చడాన్ని యువతకు చేసిన విశ్వాసఘాతుకంగా పరిగణిస్తామని సీజేపీ హెచ్చరించింది. హామీలు అమలు కాకపోతే మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపింది.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

మొదటి తరువాయి

ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, మెదక్ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక రాజధాని హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆగస్టు నెలలో రాష్ట్రానికి ఇవే తొలి హెచ్చరికలు కావడంతో వాతావరణంలో వస్తున్న మార్పుల పట్ల ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## నేడు ఏలూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

మొదటి తరువాయి



కీలకంగా వ్యవహరిస్తోంది.
ముఖ్యమంత్రి పర్యటన వివరాలు:
ఉదయం 9.55కు క్యాంప్ కార్యాలయం నుంచి బయల్దేరి 10.15కు ముసునూరు మండలం, కాట్రేనిపాడుకు చేరుకుంటారు. 10.45కు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ఆయన, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతారు. 11కు హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.20కు రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.

# అంతరిక్ష రంగంలో అద్భుతాలు చేద్దాం

**-ప్రపంచ ప్రతిభను అయస్కాంతంలా ఆకర్షిద్దాం**
**-అందుకు తగిన వాతావరణం సృష్టిద్దాం**
**-అంతరిక్ష రంగంలో గట్టి పోటీ ఇద్దాం**
**-నిలకడతో కూడిన విధానాలు తీసుకొస్తాం**
**-రిస్క్ తీసుకునే వారికి భరోసా ఇస్తాం**
**-ప్రతిభ, నాణ్యతలో రాజీలేదు ..**
**రైతుల దిగుబడి పెంపుదలకు సాయపడండి ..**
**- స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులకు ప్రధాని మోడీ పిలుపు**



న్యూఢిల్లీ:
ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత అంతరిక్ష స్టార్టప్‌లను ప్రశంసించారు. కొత్త రంగంలోకి ప్రవేశించి ధైర్యం చూపించినందుకు వారిని అభినందిస్తూ, ప్రపంచవ్యాప్త ప్రతిభను భారత అంతరిక్ష రంగం వైపు ఆకర్షించేలా ఒక ప్రత్యేక వాతావరణం సృష్టించాలని పిలుపునిచ్చారు. ఆదివారం సోషల్ మీడియాలో భారత అంతరిక్ష స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో తాను జరిపిన సమావేశం వీడియోను పంచుకున్న ప్రధానమంత్రి మోడీ, వారి శక్తి, ఆశయాలకు తాను ఎప్పటిలాగే ఆకర్షితుడిని అయ్యానని పేర్కొన్నారు. భారత అంతరిక్ష ప్రయాణం గురించి వారి అవగాహనలు, ఆశావాహ దృక్పథం అందరికీ నచ్చుతాయని అన్నారు. భారత అంతరిక్ష ప్రయాణంలో మీకు ఏది ఎక్కువ ఉత్సాహం కలిగిస్తుందో చెప్పండని ప్రజలను అడిగారు.

మీ నమ్మకాలకు తగ్గట్టుగా నిలకడైన విధానాలు

సీఈఓలు, వ్యవస్థాపకులతో మాట్లాడుతూ ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే వ్యక్తులు ఈ రంగంలో జీవితాన్ని నిర్మించుకోవాలనుకుంటే భారత్‌కు రావాలని భావించేలా ఒక ప్రత్యేక వాతావరణం సృష్టించాలని నమ్ముతున్నాను. వారు భారత స్టార్టప్‌లలో చేరాలి లేదా భారత అంతరిక్ష సంస్థలో చేరాలి అని భావించాలి. స్థిరమైన విశ్వసనీయ ప్రభుత్వ విధానాలు చాలా ముఖ్యమని ప్రధానమంత్రి మోడీ అన్నారు. ఎందుకంటే అవి రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు పెట్టుబడి పెట్టేందుకు విశ్వాసం కలిగిస్తాయి. కొత్త రంగంలో మీరు ధైర్యం చూపారు అని ప్రధాన మంత్రి అన్నారు. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే మీరు ప్రభుత్వంపై విశ్వాసం పెట్టారు. మేము తీసుకునే నిర్ణయాలు ఎల్లప్పుడూ స్థిరంగా ఉండాలని నా అభిప్రాయం. వాటిని నిరంతరం మార్చకూడదు. అలా చేస్తే రిస్క్ తీసుకునేవారికే వారికీ భరోసా కలుగుతుంది. వారి స్వంత తప్పుల వల్ల ఏదైనా జరిగితే అది వేరే విషయం కానీ ఎవరూ వారిని వదిలేస్తారు అనే నమ్మకం ఉండాలి. అటువంటి విశ్వాసాన్ని నిర్మించడమే మా లక్ష్యం అని ఆయన చెప్పారు. భారత్ అంతరిక్ష రంగం ప్రపంచ ప్రతిభా సమూహాన్ని ఆకర్షించగలదని ప్రధానమంత్రి మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మొత్తం ప్రతిభా సమూహాన్ని ఆయన స్వయంగా ఆకర్షించగలమని, అది మనకు అపార బలంగా మారుతుందని నేను నమ్ముతున్నాను అని అన్నారు.

దిగుబడి పెంపుదలకు సాయపడండి

వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక సంస్థలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, శాఖలతో సహకరించి రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకుని దిగుబడిని పెంచుకునేలా సహాయం చేయవచ్చని చెప్పారు. ప్రపంచం అంతరిక్ష రంగం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసేలా ఒక వ్యవస్థ, వాతావరణం సృష్టిస్తాం చాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో మరింత సన్నిహిత సహకారం కావాలని అన్నారు. దీనివల్ల చిన్న వయస్సు నుంచే పిల్లల్లో అంతరిక్ష రంగంపై ఉత్సుకత, ఆసక్తి పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు పాల్గొన్నారు. 2023, ఆగస్టు 23న చంద్రయాన్–3 చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలో విజయవంతంగా, మృదువైన ల్యాండింగ్ చేసిన చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం ఈ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారన్నారు. భారత్ ప్రపంచంలో నాల్గవ దేశంగా చంద్రునిపై అంతరిక్ష నౌకను దించి దక్షిణ ధ్రువం సమీపంలో ల్యాండ్ చేసిన మొదటి దేశంగా నిలిచింది.

ప్రతిభ, నాణ్యతలో రాజీలేదు

మనం అత్యధికంగా ఖర్చుపెట్టే పోటీదారులం. ప్రతిభ, నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మన దేశ ప్రజలు సహజంగా రిస్క్ తీసుకునే సామర్థ్యం ఎక్కువగా కలిగి ఉన్నందున మనం తరచూ మనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోగలమని మోడీ చెప్పారు. అంతరిక్ష సంస్థలు తమ సాంకేతికతలకు కొత్త అనువర్తనాలను అన్వేషించాలని, ప్రజల జీవితాలను ఎలా సులభతరం చేయవచ్చో దృష్టి సారించాలని ప్రధానమంత్రి ప్రోత్సహించారు. అంతరిక్ష రంగ సంస్థలు ఇతర రంగాల్లో పనిచేస్తున్న సంస్థలతో మరింత సహకారం పెంచుకోవాలని సూచించారు. ఉదాహరణగా అంతరిక్ష వైద్యంలో పనిచేస్తున్న సంస్థలు వైద్యరంగ సంస్థలతో కలిసి పనిచేసి తమ సాంకేతికతలను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవచ్చని అన్నారు.

## ఆయుష్‌కు భారీ ఊతం

మొదటి తరువాయి

2014--15 నుంచి 2023--24 వరకు పదేళ్లలో రాష్ట్రానికి మొత్తం రూ. 120.17 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. దీంతో గత పదేళ్లలో పోలిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం మూడేళ్లలోనే నాలుగు రెట్లకు పైగా అధిక నిధులు అందుబాటులోకి వచ్చాయి. 2024--25లో రూ. 83.23 కోట్లు, 2025--26లో రూ. 165.66 కోట్లు, 2026--27లో రూ. 185.75 కోట్లు చొప్పున కేంద్రం ఆమోదం తెలిపింది. ఆయుష్ వైద్య విధానాల అభివృద్ధి, మౌలిక వసతుల బలోపేతం, ఉచిత మందుల సరఫరా, డిజిటలైజేషన్, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవల విస్తరణ తదితర అంశాలకు ఈ నిధులను వినియోగించనున్నారు.

మూడు సంవత్సరాలు నిధులు లేక నిలిచిన రంగం

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో 2021--22, 2022--23, 2023--24 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా మూడు సంవత్సరాల పాటు జాతీయ ఆయుష్ మిషన్ కింద రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదల జరగలేదని ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఆయుష్ రంగం అభివృద్ధికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో సమన్వయం పెంచి వరుసగా నిధులు సాధిస్తోందని వెల్లడించింది.

తాజా ప్రణాళికలో గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. తొమ్మిది ఐటీడీఏల పరిధిలో 19 మొబైల్ వైద్య యూనిట్ల నిర్వహణకు రూ. 1.26 కోట్లు కేటాయించారు. రంపచోడవరం, చింతూరు, పార్వతీపురం, పాడేరు తదితర ప్రాంతాల్లో ఆయుష్ వైద్యధికారులు, బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తలతో కూడిన బృందాలు ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందించనున్నాయి. ఉచిత వైద్య పరీక్షలు, ఆయుష్ మందుల పంపిణీతో పాటు వ్యాధుల నివారణ, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

601 ఆయుష్ డిస్పెన్సరీలను డిజిటల్ విధానంలోకి తీసుకెళ్లేందుకు రూ. 50 లక్షలు కేటాయించారు. ఇంటర్నెట్ సదుపాయాలతో పాటు 157 మంది ఆయుష్ వైద్యాధికారులకు ల్యాప్‌టాప్ల కోసం రూ. 62.80 లక్షలు మంజూరు చేశారు. 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్, ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం కూడా నిధులు కేటాయించారు. టెలిమెడిసిన్ సేవలను విస్తరించడం ద్వారా దూర ప్రాంతాల ప్రజలకు నిపుణుల వైద్య సలహాలను సులభంగా అందించేలా చర్యలు చేపడుతున్నారు.

64 ప్రభుత్వ, పంచాయతీ, ప్రభుత్వ సహాయ ఆయుష్ డిస్పెన్సరీల అభివృద్ధికి రూ. 12.80 కోట్లు ఆమోదించారు. ఒక్కో డిస్పెన్సరీకి రూ. 20 లక్షల చొప్పున భవనాల మరమ్మతులు, ఫర్నిచర్, వైద్య పరికరాలు, సమాచార సాంకేతిక సదుపాయాలు, ఆయుష్ ఆరోగ్య సమాచార నిర్వహణ వ్యవస్థ అమలు చేయనున్నారు. గత వార్షిక కార్యాచరణ ప్రణాళికలో ఆమోదించిన 150 డిస్పెన్సరీలకు సంబంధించిన పెండింగ్ బాధ్యతల కోసం కూడా ప్రస్తుత ఏడాది నిధులు కేటాయించారు.

రాష్ట్రంలోని 712 ఆయుష్ డిస్పెన్సరీలకు ఉచిత మందుల సరఫరా కోసం రూ. 22.16 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో 334 ఆయుర్వేద, 192 హోమియోపతి, 75 యునాని, 111 జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ డిస్పెన్సరీలు ఉన్నాయి. అదనంగా నాలుగు ప్రత్యేక ఆయుష్ ఆస్పత్రులు, నాలుగు ఆయుష్ బోధనాస్పత్రులకు కూడా మందులు సరఫరా చేయనున్నారు. కడపలో నూతనంగా ఆయుష్ స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నారు. క్రీడాకారులు గాయాల నుంచి వేగంగా కోలుకునేందుకు సంప్రదాయ వైద్య విధానాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వారి శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరిచే సేవలు అందించనున్నారు.

నాలుగు ఆయుష్ బోధనాస్పత్రుల్లో మద్యం వ్యసన విముక్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వ్యసనాలకు దూరంగా ఉండేందుకు అవసరమైన చికిత్స, మానసిక ప్రశాంతతకు సంబంధించిన సేవలను అందించడం ద్వారా బాధితులను సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అదే నాలుగు బోధనాస్పత్రుల్లో పంచకర్మ, యోగా సదుపాయాలను కూడా బలోపేతం చేయనున్నారు. పక్షవాతం, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక సమస్యలకు సంప్రదాయ చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. విజయవాడలోని డాక్టర్ జీజీఎల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో ప్రత్యేక ఆక్యుపంక్చర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. కాంతి అలసట, మంట, పొడిబారడం వంటి సమస్యలకు ఆయుర్వేద విధానంలో చికిత్స అందించనున్నారు. అదే ఆస్పత్రిలో ఐఓపి రోగులు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి తాజా మూలికా కషాయాలను అందించే హెర్బల్ కషాయ థెరపీ యూనిట్‌ను కూడా ప్రారంభించనున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులలో పని ఒత్తిడిని తగ్గించేందుకు రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక యోగా వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. జీవనశైలి ఆధారిత ఆరోగ్య సమస్యల నివారణకు యోగా, వెల్‌నెస్ సేవలు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే తరహాలో నాలుగు ప్రధాన జైళ్లలోనూ యోగా వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఖైదీల మానసిక ఆరోగ్యం, జీవనశైలిలో సానుకూల మార్పులు తీసుకురావడం లక్ష్యంగా ఈ కేంద్రాలను ఉపయోగించనున్నారు.

## పార్లమెంట్ మళ్లీ సమావేశమయ్యేనా!

మొదటి తరువాయి

మూడు నాలుగు రోజుల తర్వాత (ఒక్కోసారి అదే రోజు) అధికారికంగా సమావేశ కాలం ముగిసినట్టు ప్రొరోగేషన్ నోటిఫికేషన్ జారీ చేయాలి.అయితే ఆదివారం వరకు వర్షాకాల సమావేశాలకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వు విడుదల చేయలేదు. డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించి, 2029 పార్లమెంట్ ఎన్నికల నాటికి రిజర్వేషన్లు కల్పించాలన్న ధ్యేయంతో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌ను తిరిగి సమావేశ పరుస్తుందన్న ప్రచారం జరుగుతున్నది. వర్షాకాల సమావేశాలు నిరవధిక వాయిదా పడి 10 రోజులైనా అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయకపోవడాన్ని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ ఆదివారం ప్రశ్నించారు

## గుజరాత్‌లో కల్తీ మద్యం 13 మంది మృతి

మొదటి తరువాయి

గాంధీనగర్, ఆగస్టు 23
మద్యపాన నిషేధం అమల్లో ఉన్న గుజరాత్‌లో కల్తీ మద్యం సేవించి మరణించిన వారి సంఖ్య ఆదివారం 13కు చేరుకుంది. భావ్‌నగర్ పరిసరాల్లో కొద్ది రోజుల క్రితం ఇండియన్ మేడ్–ఫారిన్ లిక్కర్ బ్రాండ్ పేరుతో ఉన్న కల్తీ మద్యాన్ని 67 మంది సేవించగా, పలువురు తీవ్ర అస్వస్థతకు గురై దవాఖానల్లో చేరారు. గత రెండు రోజుల్లో ఐదుగురు బాధితులు ప్రాణాలు కోల్పోగా, ఆదివారం మరో ఇద్దరు చనిపోయారు.బాధితులు సేవించిన కల్తీ మద్యంలో విషపూరిత ద్రావణం మెథనాల్ ఉన్నట్టు ఫోరెన్సిక్ పరీక్షల్లో తేలింది. ఈ విషాద ఘటనపై వార్తేజ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. 21 మందిని నిందితులుగా పేర్కొన్నారు. దీంట్లో 13 మందిని అరెస్టు చేశారు. ఆగస్టు 16న ముగ్గురు స్నేహితులు మద్యం సేవించిన తర్వాత తీవ్ర అనారోగ్యంతో దవాఖానలో ఒకరి తర్వాత ఒకరు మరణించారు. దీంతో కల్తీ మద్యం ఘటన వెలుగు చూసింది.

## ఖరగ్‌పూర్--అమరావతి హైవేకు గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి




తరపున కృతజ్ఞతలు తెలిపారు.
రాష్ట్రంలో 457 కి.మీ.
మొత్తం 1,107 కి.మీ.
పొడవైన కారిడార్‌లో 457 కి.మీ. మేర రాష్ట్రం మీదుగా సాగనుంది. ప్రతిపాదిత మార్గం పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఏపీలోకి ప్రవేశించి ఏజెన్సీ ప్రాంతాలను దాటుతూ అమరావతి వైపు సాగనుంది. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల మీదుగా ఈ కారిడార్ వెళ్లేలా ప్రతిపాదనలు ఉన్నాయి.

నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి

ఈ ప్రాజెక్టును నాలుగు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేగా అభివృద్ధి చేయనున్నారు. అధిక వేగంతో ప్రయాణించే వాహనాలకు అనువుగా నిర్మాణం చేపట్టడం ద్వారా తూర్పు భారతదేశం--ఆంధ్రప్రదేశ్ మధ్య సరుకు, ప్రయాణికుల రవాణా మరింత వేగవంతం కానుంది. కొత్త కారిడార్ అందుబాటులోకి వస్తే రైతులు, పరిశ్రమలకు రవాణా వ్యయం తగ్గే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తూర్పు భారతదేశంలోని మార్కెట్లకు ఏపీ నుంచి సరుకు రవాణా సులభతరం కావడంతో వ్యాపారం, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలకు ఊతం లభించనుంది. ఇప్పటికే రాష్ట్రంలో జాతీయ రహదారి ప్రాజెక్టుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

## టీ కొత్తపల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం, ఆగస్టు 23 ,( నేటి దర్శిని )**
శ్రీనిధి హాస్పిటల్స్, అమలాపురం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ.పోలవరం మండలం టి కొత్తపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్న హాస్పిటల్ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## 1322వ రోజుకు చేరుకున్న లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పన్ లయన్స్ ఉచిత భోజన పథకం





**ముమ్మిడివరం ఆగస్టు 23 ,( నేటి దర్శిని**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్ళరేవు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరాటంకంగా కొనసాగుతున్న లయన్ కొప్పిశెట్టి లక్ష్మయ్య బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకం మొదలై ఆదివారం నాటికి 1322వ రోజుకు చేరుకుంది. అన్నదాత స్వర్గీయ శ్రీ నడింపల్లి సుబ్రహ్మణ్య వర్మ దశహం సందర్భంగా ఆయన కుమారులు లయన్ నడింపల్లి సూర్యనారాయణ రాజు (వినోద్ ), నడింపల్లి వెంకట భాస్కర వర్మ (నవీన్ )లచే అభాగ్యులకు భోజనములు, బ్రెడ్స్ ఏర్పాటు చేసారు.వీరికి ఆ అభాగ్యుల ఆశీస్సులు మరియు వీరి సేవా దృక్పథానికి లయన్స్ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## తాళ్లరేవులో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు





**ముమ్మిడివరం, ఆగస్టు 23 ,( నేటి దర్శిని )**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని తాళ్ళరేవు సంత మార్కెట్ నందు అగ్నిప్రమాదం సంభవించి మూడు ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. బాధిత కుటుంబాలను శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ఆదివారం పరామర్శించి వారికి నిత్యావసరాలు, వస్త్రాలు అవసరమైన సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు ప్రభుత్వ గృహాలను మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, సీనియర్ నాయకులు మందాల గంగ సూర్యనారాయణ,టేకుమూడి లక్ష్మణరావు,మేడిశెట్టి సత్తిబాబు,వాసంశెట్టి శ్రీనివాస్,అద్దేపల్లి సతీష్, మందపాటి సతీష్,కుడుపూడి దుర్గాప్రసాద్, గాదిరాజు సత్యనారాయణ రాజు,గంజా సూరిబాబు,ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్లలగూడెంలో ఘనంగా గంగమ్మ తల్లి పూజలు



**మునుగోడు ఆగస్టు 23,( నేటి దర్శిని )**
ఎల్లలగూడెం గ్రామంలో గంగమ్మ తల్లి పూజలు ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, రైతుల ఇళ్లల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకుంటూ గ్రామదేవత గంగమ్మ తల్లికి వరద పాయసం పోసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించి, గ్రామం సల్లగా ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.

# పేరుకే ఎస్ఐఆర్ ప్రత్యేక శిబిరాలు..

**-పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో లేని బీఎల్‌వోలు**
**-అధికారుల పర్యవేక్షణ కరువు..!**




**ఉరవకొండ రూరల్, ఆగస్టు 23 ,( నేటి దర్శిని )**
కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు ఎస్ఐఆర్‌లో భాగంగా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఉరవకొండ మండలంలో కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక శిబిరాల రోజుల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో లేకపోవడంతో దరఖాస్తుల కోసం వచ్చిన ఓటర్లు ఇబ్బందులు పడుతూ వెనుదిరుగుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎస్ఐఆర్‌లో భాగంగా ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ, కొన్ని కేంద్రాల్లో వారు కనిపించలేదని ఓటర్లు ఆరోపించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను కింది స్థాయి అధికారులు సక్రమంగా అమలు చేయడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని ఉరవకొండ మండలంలో మొత్తం 85 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆదివారం చిన్న ముష్టూరులోని 168, 169 పోలింగ్ కేంద్రాలు, ఆమిద్యాలలోని 179 నుంచి 185 వరకు పోలింగ్ కేంద్రాలు, రాకెట్లలోని 196 నుంచి 199 వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి బీఎల్‌వోలు అందుబాటులో లేరని స్థానికులు తెలిపారు. దీంతో క్లెయిమ్‌లు, అభ్యంతరాల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రత్యేక శిబిరాల నిర్వహణపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ పెంచి, ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్‌వోలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు. ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం ప్రజలకు సక్రమంగా చేరాలంటే అధికారుల పర్యవేక్షణ మరింత పటిష్టంగా ఉండాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# నిడుమామిడిలో జటిలమైన తాగునీటి సమస్య

**రెండు నెలలుగా నీటి కోసం కాలనీవాసుల అవస్థలు**



**శ్రీ సత్య సాయి బ్యూరో, ఆగస్టు 23 ,( నేటి దర్శిని )** శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి మండలం నిడుమామిడి గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గత రెండు నెలలుగా కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని బోరు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో తాగునీటి కోసం సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి బిందెలు, బకెట్లతో నీటిని తీసుకొచ్చి అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపించారు. సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నప్పటికీ అధికారులు ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆదివారం కాలనీలో నెలకొన్న పరిస్థితులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో రెండు నెలలుగా తాగునీటి సమస్య కొనసాగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సమస్యపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించగా కేవలం రెండు రోజుల నుంచి మాత్రమే నీటి సమస్య ఉందని చెప్పడం సరికాదన్నారు. సమస్య రెండు నెలలుగా ఉంటే కేవలం రెండు రోజులుగా ఉందని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని వెంకటేష్ ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకుండా కాలనీవాసులు అబద్ధాలు చెబుతున్నారని పేర్కొనడం కూడా సరికాదన్నారు. వాస్తవ పరిస్థితులను అధికారులు స్వయంగా పరిశీలించి ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకోవాలని సూచించారు. కాలనీలోని బోరుకు ఇప్పటికే రెండు, మూడు పైపులు ఏర్పాటు చేశారని, మరిన్ని పైపులు వేసి శక్తివంతమైన మోటార్‌ను బిగిస్తే ఆశించిన స్థాయిలో నీరు లభించే అవకాశం ఉందని గ్రామస్తులు వెంకటేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన నిధులను సమకూర్చి బోరును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. నిడుమామిడిలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని వెంకటేష్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఎస్సీ కాలనీల్లో తాగునీటి సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడం ప్రభుత్వ యంత్రాంగం ప్రథమ బాధ్యతగా భావించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో నిడుమామిడి ఎస్సీ కాలనీ తాగునీటి సమస్యను ప్రత్యేకంగా ప్రస్తావించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వెంకటేష్ హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీవాసులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

# భీమవరం విలీనానికి మేం ఒప్పుకోం..

**-నాలుగు గ్రామాల ప్రతినిధుల స్పష్టీకరణ**
**-మున్సిపాలిటీలో కలిసేందుకు విముఖత..**
**రెండో సమావేశం కూడా ఫలించని వైనం**



**భీమవరం బ్యూరో, ,( నేటి దర్శిని )**
భీమవరం మున్సిపాలిటీలో విలీనం చేయాలని ప్రతిపాదించిన నాలుగు గ్రామాల ప్రతినిధులు తమ నిర్ణయాన్ని స్పష్టం చేశారు. కొవ్వాడ, అన్నవరం, చినఅమిరం, తాడేరు, రాయలం గ్రామాల విలీన అంశంపై భీమవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) ఆధ్వర్యంలో గ్రామాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. విలీనం వల్ల మున్సిపాలిటీ అభివృద్ధి చెందడంతో పాటు ఉన్నత స్థాయికి చేరుతుందని, నిధులు పెరిగి అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని నేతలు వివరించారు. గత ఆరేళ్లుగా మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడం వల్ల ఏర్పడిన నష్టాలను కూడా ప్రతినిధులకు వివరించి, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమిష్టి ప్రయోజనాల దృష్టితో ఆలోచించాలని కోరారు. అయితే కొవ్వాడ, అన్నవరం, చినఅమిరం గ్రామాల ప్రతినిధులు తమ గ్రామాలు ఇప్పటికే అభివృద్ధిలో ముందున్నాయని, విలీనానికి తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. తాడేరు గ్రామ ప్రతినిధులు గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డును తొలగిస్తామని హామీ ఇస్తే విలీనానికి అంగీకరిస్తామని తెలిపారు. రాయలం గ్రామ ప్రతినిధులు మిగిలిన గ్రామాలు అంగీకరిస్తే తాము కూడా ఒప్పుకుంటామని చెప్పారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో రెండోసారి నిర్వహించిన సమావేశం కూడా ఎలాంటి నిర్ణయానికి రాకుండానే ముగిసింది. న్యాయస్థానాల్లో ఉన్న కేసులు, గ్రామాల ప్రతినిధుల నుంచి విలీనానికి అంగీకారం లభించకపోవడంతో భీమవరం మున్సిపల్ ఎన్నికలు సకాలంలో జరుగుతాయా అన్న సందేహాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కే. రామచంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు మెంటే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# బస్సులకు జాన్కంపేట్ బోర్డు ఏర్పాటు చేయాలి..

**ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి**




**వేల్పూర్, ఆగస్టు 23 (,( నేటి దర్శిని**
ఆర్మూర్ నుంచి చేంగల్ మీదుగా భీమ్‌గల్ వెళ్లే బస్సులకు జాన్కంపేట్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు ఆర్మూర్ డిపో మేనేజర్‌ను కోరుతున్నారు. భీమ్‌గల్ వెళ్లే బస్సులపై జాన్కంపేట్ పేరు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సులపై జాన్కంపేట్ మినహా మిగతా అన్ని గ్రామాల పేర్లు ప్రదర్శిస్తున్నారని, జాన్కంపేట్ పేరు లేకపోవడంతో ఏ బస్సు ఎక్కాలో ప్రయాణికులు తికమక పడుతున్నారని వాపోతున్నారు. జాన్కంపేట్ గ్రామం మీదుగా వెళ్లే బస్సులపై ఆ గ్రామం పేరును కూడా ప్రదర్శించాలని కోరుతున్నారు. దీంతో ప్రయాణికులకు బస్సుల మార్గంపై స్పష్టత ఉంటుందని పేర్కొన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులపై జాన్కంపేట్ గ్రామం పేరును ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం బుడగ జంగాల కాలనీవాసుల విజ్ఞప్తి



**మునుగోడు ,( నేటి దర్శిని )**
మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో తమకు అవకాశం దక్కలేదని బుడగ జంగాల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల పరిస్థితిని అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా పరిశీలించి అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపులో న్యాయం చేయాలని కోరుతున్నారు. మేము కూడా మనుషులమే సార్.. మా కుటుంబాలకు కూడా ఆశలు, అవసరాలు ఉన్నాయి. మా గోడు వినండి.. మాకు న్యాయం చేయండి" అంటూ కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.







## నిధి అగర్వాల్ అందాల జాతర..

# రిబాక్సాఫీస్ వద్ద ఢీలా..


### ఓటీటీలో లక్ పరీక్షించుకోనున్న అలియాభట్ 'అల్ఫా'




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది అలియా భట్. ఈ భామ నటించిన తొలి ఫీ మేల్ ఓరియెంటెడ్ స్పై యాక్షన్ థ్రిల్లర్ అల్ఫా . యశ్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో తెరకెక్కిన ఈ చిత్రాన్ని శివ్ రావైల్ డైరెక్ట్ చేశాడు. యశ్ రాజ్ ఫిలింస్ లాంటి అగ్ర నిర్మాణ సంస్థలో వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచింది. కాగా ఇక ఓటీటీలో తన లక్‌నుపరీక్షించుకునేందుకు రెడీ అయింది.అల్ఫా ఆగస్టు 28 నుంచి పాపులర్ ఓటీటీ ప్లాట్ ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి ఒరిజినల్ హిందీ వెర్షన్ స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుస్తుండగా.. డబ్‌డ్ వెర్షన్లకు సంబంధించిన అప్‌డేట్ రావాల్సి ఉంది. శార్వరి మరో లీడ్ రోల్‌లో నటించిన ఈ మూవీలో అనే కామియో రోల్‌లో హృతిక్ రోషన్ కబీర్ నటించాడు. బాబీ డియోలక్ష, అనిల్ కపూర్ ఇతక కీలక పాత్రలు పోషించారు. భారీ అంచనాల మధ్య విడుదలై బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయిన అల్ఫా మరి ఓటీటీలో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో తృప్తి డిమ్రి హొయలు..

### - టాక్ ఆఫ్ ది టౌన్‌గా కొత్త కలెక్షన్




పాపులర్ ఫ్యాషన్ యాక్సెసరీస్ బ్రాండ్‌కు యానిమల్ భామ తృప్తి డిమ్రి తొలి బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకమైన విషయం తెలిసిందే. ఈ బ్రాండ్ రీసెంట్‌గా ఇప్పుడు ఇండియాలో సరికొత్త ఐకానిక్ సెక్సీ కలెక్షన్స్‌ను లాంచ్ చేసి నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది. ఈ క్యాంపెయిన్ కోసం బ్లాక్ కాస్ట్యూమ్స్‌లో మెరిసింది తృప్తి డిమ్రి. బ్లాక్ స్టైలిష్ కాస్ట్యూమ్స్‌లో డైమండ్ జ్యువెలరీ, సాఫ్ట్ వేవ్స్, రేడియేటింగ్ బోల్డ్ అవతార్‌లో గ్లామరస్‌గా కనిపిస్తూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది.ఢిల్లీలోని ఆంబియెన్స్ మాల్స్ విక్టోరియా సీక్రెట్ వద్ద కొత్త కలెక్షన్ లాంచ్ చేశారు. సెక్సీ కలెక్షన్లు ఎప్పుడూ కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే స్వయం వ్యక్తీకరణను మరింత పెంపొందించే విధంగా చేస్తాయని తృప్తి డిమ్రి చెప్పుకొచ్చింది. తృప్తి డిమ్రి ఈ ఏడాది ఓ రోమియో, మా బెహన్ సినిమాల్లో మెరిసింది. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ నటిస్తోన్న స్పిరిట్‌లో ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

# బన్నీ స్టైల్ కాపీ కొట్టా



ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన మలయాళీ బ్యూటీ మమిత బైజూ. వరుస అవకాశాలు అందుకుంటూ సక్సెస్ రేస్‌లో దూసుకుపోతున్నది. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌ని ఫిదా చేసిన ఈ అమ్మడు నటించిన డ్యూడ్, జననాయగన్ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర మంచి కలెక్షన్లు రాబట్టాయి. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'లో నటించింది. ఈ సందర్భంగా అమ్మకుట్టి పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి...మాది కేరళంలోని కొట్టాయం. నాన్న డాక్టర్. అన్నయ్య రాష్ట్రస్థాయి క్రికెటర్. నా జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలన్నీ మా అన్నయ్యే తీసుకుంటాడు. నాకొచ్చే లవ్ ప్రపోజల్స్‌ను డీల్ చేయడంతో పాటు నాకొచ్చే పెండ్లి సంబంధాల్లోనూ ఆయన నిర్ణయమే ఫైనల్. నా తొలి సినిమా 'సర్వోపరి పాలక్కారన్' అయినా, నాకంటూ గుర్తింపు తెచ్చింది మాత్రం ప్రేమలు చిత్రమే. దాదాపు రూ.100 కోట్లకు పైగా వసూళ్లను సాధించడంతో పాటు నా కెరీర్‌ని మలుపు తిప్పిన సినిమా ఇది. మలయాళి సినిమానే అయినా ఎక్కువ భాగం షూటింగ్ హైదరాబాద్‌లోనే చిత్రీకరించారు. అందుకే తెలుగు ప్రేక్షకులు దీన్ని ఎంతో ఆదరించారు. నేను అల్లు అర్జున్‌కు పెద్ద ఫ్యాన్‌ని. ఆయన నటించిన ఇద్దరమ్మాయిలు సినిమా అంటే నాకెంతో ఇష్టం. ఆ సినిమాలో బన్నీ ఉపయోగించిన వాచ్, ధరించిన టీషర్ట్స్, ఆయన్హైస్టైల్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆయన మీదున్న అభిమానంతో ఆ్హైస్టైల్‌ను కాపీ చేస్తుంటాను. ఇక కర సినిమా కోసం ధనుష్ ఎంతో కష్టపడ్డాడు. స్టార్ హీరో సూర్యతో కలిసి ప్రధాన పాత్రలో నటించడం గొప్ప అవకాశంగా భావిస్తాను. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనం ఎక్కువైపోయింది. సెలెబ్రిటీ అనే కారణంతో నేను అడపాదడపాగా సోషల్‌మీడియాలో ఉండేదాన్ని. ప్రస్తుతం సోషల్‌మీడియాతో వచ్చే పబ్లిసిటీ కంటే మానసిక ప్రశాంతతకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. అది ఆచరణలో పెడుతున్నాను కూడా. ఇక నా సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు మా పీఆర్ టీమ్ అందిస్తారు. ఒక్క సినిమా వెనుక ఎంతోమంది కష్టం దాగుంటుంది. అది ఎప్పుడూ వృథా కాకూడదన్నది నా భావన. జన నాయగన్ లీకైన విషయం తొలుత నమ్మలేదు. సోషల్ మీడియాలో వినిపించేవన్నీ వాస్తవాలు కావని కొట్టిపారేశాను. ఉద్దేశపూర్వకంగా కొందరు ప్రచారం చేస్తున్నారనుకున్నా. కానీ, దురదృష్టవశాత్తు అదే నిజమైంది.

# అర్జున్ దాస్, అదితి శంకర్ 'వన్స్ మోర్' ట్రైలర్ విడుదల!




ప్రేమలో విఫలమై మనసు మార్చుకున్న రగ్డ్ హీరో, ఆయన చుట్టూ తిరిగే సరికొత్త భావోద్వేగాల కథతో తెరకెక్కిన చిత్రం 'వన్స్ మోర్' . విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో అర్జున్ దాస్ సరసన అదితి శంకర్ కథానాయకిగా నటిస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా అర్జున్ దాస్ ఈ చిత్రంలో చాలా సాఫ్ట్ అండ్ లవబుల్ పాత్రలో కనిపిస్తుండగా, ఆయన జీవితంలోకి ఎంట్రీ ఇచ్చి అల్లరి చేసే ఉత్సాహభరితమైన యువతిగా అదితి శంకర్ అదరగొట్టింది.గతం తాలూకు జ్ఞాపకాలు, ప్రేమలో ఎదురైన గాయాల నుంచి కోలుకోవడం , మరియు జీవితంలో దొరికే రెండో అవకాశం అనే అంశాల చుట్టూ ఈ కథ నడుస్తుందని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రానికి 'హృదయం', 'ఖుషి' వంటి మ్యూజికల్ హిట్స్ అందించిన హెషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, ఇప్పటికే విడుదలైన పాటలు సోషల్ మీడియాలో విశేష స్పందనను రాబట్టాయి. మిలియన్ డాలర్ స్టూడియోస్ బ్యానర్‌పై యువరాజ్ గణేషన్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా ఆగస్ట్ 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# టాలీవుడ్‌లో మరోసారి థియేటర్ల వార్..

### 'టాక్సిక్' ఎంట్రీతో ఇబ్బందుల్లో తెలుగు సినిమాలు!




తెలుగు చిత్ర పరిశ్రమలో థియేటర్ల కేటాయింపుల వివాదం మరోసారి తీవ్రరూపం దాల్చింది. బాక్సాఫీస్ వద్ద స్టైట్ తెలుగు మరియు డబ్బింగ్ చిత్రాలు ప్రదర్శితమవుతున్న వేళ, పాన్-ఇండియా స్థాయిలో రాబోతున్న భారీ బడ్జెట్ డబ్బింగ్ సినిమా 'టాక్సిక్' ఎంట్రీతో సమీకరణాలు పూర్తిగా మారిపోతున్నాయి. రాకింగ్ స్టార్ యష్ హీరోగా గీతు మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉండటంతో, ఎగ్జిబిటర్లు ఈ సినిమాకు అత్యధిక సంఖ్యలో స్క్రీన్లను కేటాయించేందుకు పోటీ పడుతున్నారు.ఇటు టాలీవుడ్‌లో సూర్య హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'విశ్వనాథ్ అండ్ సన్స్', అలాగే రవితేజ నటించిన 'ఇరుముడి' చిత్రాలు పాజిటివ్ టాక్‌తో విజయవంతంగా ప్రదర్శించబడుతున్నాయి. ఇలాంటి తరుణంలో 'టాక్సిక్' లాంటి భారీ క్రేజ్ ఉన్న పాన్-ఇండియా చిత్రం ఎంట్రీ ఇస్తుండటంతో థియేటర్ల పోరు నైజాంతో పాటు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మళ్లీ మొదలైంది. ముఖ్యంగా నైజాం ప్రాంతంలో స్క్రీన్ల సర్దుబాటు నిర్మాతలు మరియు డిస్ట్రిబ్యూటర్లకు తలనొప్పిగా మారింది. భారీ రేట్లకు థియేటర్ల హక్కులను దక్కించుకున్న బడా సంస్థలు సింగిల్ స్క్రీన్లతో పాటు మల్టీప్లెక్స్‌లలోనూ సింహభాగం స్క్రీన్లను 'టాక్సిక్' కోసం లాక్ చేస్తున్నట్లు సమాచారం. దీనివల్ల బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకోవాలని చూస్తున్న స్థానిక తెలుగు చిత్రాలకు, చిన్న సినిమాలకు థియేటర్ల కొరత తీవ్రంగా ఏర్పడుతోంది. ప్రతిసారీ భారీ బడ్జెట్ పాన్-ఇండియా సినిమాలు విడుదలైనప్పుడల్లా టాలీవుడ్‌లో లోకల్ సినిమాలకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తడం, థియేటర్ల కోసం పెద్ద యుద్ధమే జరగడం పరిపాటిగా మారింది. ఈసారి ఈ వివాదం ఏ స్థాయికి వెళు ్తుందోనని సినీ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450